మామిడిని ముంచిన ముందస్తు వర్షం

- పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని రైతుల ఆవేదన
- ప్రభుత్వం ఆదుకోవాలని విన్నపం

బేతంచెర్ల: ముందస్తు వర్షాలు మామిడి రైతులను నిండా ముంచేశాయి. ఈ ఏడాది వేసవి కాలం ముగియకుండానే ముందస్తుగా వర్షాలు కురవడం తో మామిడి రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. బేతంచెర్ల మండలంలోని యంబాయి, గూటుపల్లె, ఆర్ఎస్ రంగాపురం, బేతంచెర్ల, గోరుమానుకొండ, కొలుములపల్లె, రహిమానుపురం గ్రామాల్లో మామిడి తోటలు సాగవుతున్నాయి. వాతావరణం అనుకూలించక పూత పిందె రాలిపోయి అంతంత మాత్రంగానే దిగుబడులు ఉండగా, మామిడి పండ్లు పక్వదశకు వచ్చే సమయంలో వర్షాలు పడటంతో పండు ఈగ వాలి మార్కెట్ తరలించకుండానే పండ్లు పురుగులు పడి కుళ్లిపోయి దెబ్బతింటున్నాయి. కొంతమంది రైతులు, కౌలు రైతులు మామిడి పండ్లను మార్కెట్‌కు తరలించినా ధర అంతంత మాత్రంగానే ఉండటంతో పెట్టిన పెట్టుబడులు కూడ రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేసిన కౌలు రైతుల పరిస్థితి వర్ణణాతీతం.

మామిడి సాగు వివరాలు	
మండలం	విస్తీర్ణం (హెక్టార్లలో..)
డోన్	1.399
బేతంచెర్ల	250
ప్యాపిలి	588



బేతంచెర్లలో అమ్మకాలు లేకపోవడంతో వేచి చూస్తున్న మామిడి పండ్ల వ్యాపారులు, కౌలు రైతులు

రూ.5 లక్షల దాక నష్టం వచ్చింది



8 ఏళ్లుగా మామిడి తోటలను కౌలుకు రైతుల నుంచి కొనుగోలు చేసి కాయలను మార్కెట్‌కు తరలించి జీవనం కొనసాగిస్తున్నాను. ఈ ఏడాది 10 ఎకరాల వరకు మామడి తోటలను కౌలుకు తీసుకున్నాను. ఎప్పుడూలేని విధంగా ఈ ఏడాది ముందస్తు వర్షాలతో పండ్లపై ఈగ వాలి పురుగులు పడటంతో సుమారు రూ.5 లక్షల దాక నష్టం వచ్చింది.
– చాకలి మద్దిలేటి స్వామి, కౌలు రైతు ముద్దవరం గ్రామం

ప్రభుత్వం ఆదుకోవాలి



20 ఏళ్లుగా మామడి తోటలను కౌలుకు తీసుకొని జీవనం సాగిస్తున్నాను. ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది అకాల వర్షాలు కురవడంతో మామిడి పండ్లకు ఈగ వాలడంతో పురుగులు పడుతున్నాయి. బ్యాంకులో బంగారం కుదవ పెట్టి రుణం తీసుకొని మామడి తోటలను కొనుగోలు చేశాను. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా లేవు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలి. – అమినాబీ, కౌలు రైతు, బేతంచెర్ల

అకాల వర్షాల వల్ల నష్టమే

ఈ ఏడాది అకాల వర్షాల వల్ల మామిడి రైతులకు నష్టమే. వేసవి కాలంలో వర్షాలు కురవడం వలన పండు ఈగ వచ్చి పరుగులు పడుతుంటాయి. రైతులు ముందస్తు జాగ్రత్త చర్య లోభాగంగా పండ్లకు కవర్లు కట్టు కోవడం వలన లేదా ఎకరాకు పది లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకుంటే కొంత మేర పండు ఈగ ఉధృతిని నివారించవచ్చు. అందరూ రైతులు సామూహికంగా ఈలాంటి చర్యలు చేపడితేనే ఇది సాధ్యం అవుతుంది. – ఉద్యాన శాఖ అధికారి రఘువరన్

క్లుప్తంగా

థియేటర్ తనిఖీ



థియేటర్‌లో క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని శివరామ్ థియేటర్‌ను తహసీల్దార్ నారాయణరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లు,మూత్రశాలతో పాటు క్యాంటీన్‌లో విక్రయిస్తున్న తినుబండరాలు నాణ్యత, ధరల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తనిఖీ చేసిన్నట్లు చెప్పారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం



బాలకృష్ణుడును సన్మానిస్తున్న అధికారులు

ప్యాపిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీగా విధులు నిర్వర్తిస్తూ ఎంపీడీఓగా పదోన్నతిపై సత్యసాయి జిల్లా సీకే పల్లి మండలానికి బదిలీ అయిన బాలకృష్ణుడును బుధవారం కార్యాలయ సిబ్బంది, అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో పారిశుద్ధ్య లోపం



బస్టాండ్ అవుట్‌గేట్ సమీపంలో పేరుకుపోయిన వ్యర్థాలు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ అవుట్‌గేట్ సమీపంలో చెత్త, చెదారం పేరుకుపోయింది. పరిసర ప్రాంతాల దుకాణదారులు, పండ్ల వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు మిగిలిపోయిన వ్యర్థాలు, చెత్త, వేస్ట్ కవర్లు, తదితర కుళ్లిన పదార్థాలను అక్కడే పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి వ్యర్థాలను తొలగించకపోవడంతో రాత్రి సమయాల్లో దోమల బెడద అధికంగా ఉంటోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: మండల పరిధిలోని జగదుర్తి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు పనుల కారణంగా వెల్దుర్తి 33 కెవి ఫీడర్ లైన్ షిఫ్టింగ్ పనులు చేయడానికి గురువారం ఉదయం 10 నుంచి సాయిత్రం 5 గంటల వరకు జగదుర్తి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు, ఇండస్ట్రీయల్ ఏరియాకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ నాగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని రైతులకు త్రీఫేస్ కరెంటు గురువారం తెల్లవారు జామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు, సాయిత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు సరఫరా ఇస్తామన్నారు.

నేటి నుంచి విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠోత్సవం

బనగానపల్లె రూరల్ : మండలంలోని పలుకూరు గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు గురువారం నుంచి ఈ 31వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. పురోహితులు గురుమూర్తి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 30న ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మధ్యాహ్నం గ్రామోత్సవం ఉంటుందని, 31న ఉదయం వేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠ ఉంటుందని, అనంతరం భక్తులకు అన్నదాన ఏర్పాటు చేశామని చెప్పారు.

జిల్లాస్థాయి హరి కథ, బుర్ర కథ పోటీలు

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేటలో వెలసిన శాంభవి రేణుక ఎల్లమాంబేశ్వరి జ్యోతిర్లింగేశ్వర స్వామి దేవస్థానం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి జీవిత చరిత్రపై జిల్లా స్థాయి హరికథ, బుర్రకథ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఏఈ నాగరాజు తెలిపారు. బుధవారం వార్షికోత్సవ కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1న అమ్మవారికి వార్షికోత్సవ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హరికథ, బుర్రకథ పోటీల్లో పాల్గొన దలచిన బృందాలు గురువారం సాయిత్రం లోపు 8520852058 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని, 30న పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు వాయిద్య పరికరాలు వారే తెచ్చుకోవాలని, రవాణా చార్జీలు చెల్లించడంతో పాటు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

వందే భారత్ ట్రైన్‌ను డోన్‌లో ఆపాలి

డోన్ టౌన్: హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లే వందే భారత్ రైలు డోన్‌లో ఆపాలని(స్టాపింగ్) ఆర్పీఐ రాష్ట్ర నాయకులు హుసేనప్ప, ఎమ్మార్పీస్ నాయకులు భూమ నాగన్న బుధవారం గుంతకల్లు రైల్వే డివిజన్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తకు వినతి పత్రం అందజేశారు. కర్నూలు వరకు వచ్చే తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలును కూడా డోన్ వరకు పొడిగించాలని కోరారు. డోన్ రైల్వే జంక్షన్ కావడంతో ఇక్కడికి అనంతపురం, కర్నూలు ఉమ్మడి జిల్లాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు డోన్ స్టేషన్‌కు తరలి వస్తుంటారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రైల్వేలో జరుగుతున్న సివిల్ పనులను సివిల్ ఇంజినీరింగ్ చేసిన నిరుద్యోగులకు నామినేషన్ పద్ధతిలో కేటాయించాలని కోరారు.



డీఆర్ఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్పీఐ నాయకులు

రహదారికి మరమ్మతులు

బేతంచెర్ల: పట్టణంలోని భారత్ బేకరి సందులోని వీధి రహదారి దెబ్బతిని గతుకుల మయంగా ఉందని ఈనెల 15న సీఐటీయూ నాయకులు, కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు 14 రోజుల తరువాత బుధవారం నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ స్పందించారు. గతుకులమయంగా ఉన్న వీధి రహదారికి, దెబ్బతిన్న డ్రైనేజీకి మరమ్మతులు చేయించేందుకు చర్యలు చేపట్టారు.



పనులు చేయిస్తున్న దృశ్యం

జయప్రదం చేయండి

కోవెలకుంట్ల: రాయలసీమలో శాశ్వత కరువు నివారించే సిద్ధేశ్వరం అలుగు సాధనకు నిర్వహించ తలపెట్టిన చలో సిద్ధేశ్వరం సభను జయప్రదం చేయాలని సాగునీటి ఉద్యమకారులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని జీవీ కొండారెడ్డి స్మారక గ్రంథాలయంలో సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరీంబాషా, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుధాకర్, కుందూ పరిరక్షణ సమితి నాయకులు పేరా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి తాగు, సాగునీరు పుష్కలంగా అందాలంటే అలుగుతో పాటు గుండ్రేవుల, తుంగభద్ర ఎగువ సమాంతర కాలువ, వేదవతి ఎత్తిపోతల ప్రాజెక్టు, తెలుగుగంగ, గాలేరునగరి, వెలగొండ, జోళదరాశి, రాజోలి ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.ఈ నెల 31వ తేదీన జరిగే బహిరంగ సభకు రాయలసీమ జిల్లాల నుంచి రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. వెంకటసుబ్బయ్య, ఓబులేసు, రామచంద్ర రాజు, వడ్డెసుబ్బరాయుడు, బాలయ్య, మహేశ్వ రావు పాల్గొన్నారు.

ఆర్టీసీ పార్శిల్ బుకింగ్ కౌంటర్ ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): పట్టణ ప్రజల సౌకర్యార్థం టెక్కె మార్కెట్ యార్డు ఎదురుగా ఆర్టీసీ పార్శిల్ బుకింగ్ కౌంటర్‌ను బుధవారం డిపో మేనేజర్ గంగాధర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఇక్కడ పార్శిల్ బుకింగ్‌తో పాటు బస్సుల ఆన్‌లైన్ రిజర్వేషన్ కూడా చేయనున్నట్లు చెప్పారు. వివాహాది కార్యక్రమాలకు బస్సులను అద్దెకు సైతం ఇస్తామన్నారు. మరింత సమాచారం కోసం 6281892299, 9392850152 నంబర్లను సంప్రదించాలన్నారు.



ఆర్టీసీ పార్శిల్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న డీఎం గంగాధర్‌రావు

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కొలిమిగుండ్ల: మండలంలోని ఎస్.చెన్నంపల్లెలో గురువారం నుంచి మూడు రోజుల పాటు సీతా రామాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టీటీడీ, దాతల సహకారంతో నూతనంగా ఆలయాన్ని నిర్మించామన్నారు. వేదపండితులు ప్రదీప్‌కుమార్, మాడుగుల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు,కల్యాణం జరుగుతాయని చెప్పారు. చివరి రోజున ధ్వజ స్తంభంతో పాటు సీతారామాంజనేయ విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని వివరించారు.

రెడ్డిపల్లెలో అక్రమంగా ఇసుక తరలింపు

సంజామల: అధికార పార్టీ అండదండలతో ఇసుక మఫియా బరితెగిస్తోంది. దేవుడి మాన్యాలను కూడా వదలకుండా దోచేస్తుండటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో ఓ అడుగు వెనుకేసింది. మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి అంకాలమ్మ అమ్మవారి మాన్యంలోనున్న వంక ఇసుకు తవ్వి, విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. బుధవారం వంక ఇసుకను జేసీబీ సాయంతో రెడ్డిపల్లె పక్క గ్రామాలకు ట్రాక్టర్ టిప్పు రూ.400 చొప్పున దాదాపు 80 టిప్పులు అక్రమంగా తరలించాడు. దీంతో గ్రామ కట్టుబాటుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండటం, అధికార పార్టీ బలంలో అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తిపై గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. అయితే ఫిర్యాదు చేశారనే సమాచారం తెలుసుకొని సదరు నాయకుడు జేసీబీ, వాహనాలను వెంటనే అక్కడి నుంచి తరలించి జారుకున్నాడు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కోవెలకుంట్ల: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం కలుగుతుందని ఎంపీడీఓ వరప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాష్‌నాయుడు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు యోగాసనాలను ప్రదర్శించారు.

సకాలంలో వ్యాక్సిన్ వేయాలి

సంజామల: గ్రామాల్లో పశువులకు ముందుగానే వ్యాక్సినేషన్ చేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మోహన్ రావు సూచించారు. స్థానిక పశుసంవర్ధక శాఖ ఏరియా ఆసుపత్రిలో బుధవారం కొలిమిగుండ్ల,సంజామల మండల్లాల్లోని ఆ శాఖ డాక్టర్లు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏడీ మాట్లడుతూ..గ్రామాల్లో పాడి రైతులకు అందుబాటులో ఉండి సకాలంలో ముందుస్తు టీకాలను వేయాలని ఆదేశించారు. వర్షకాంలో గొంతువాపు వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. డాక్టర్లు రఘుబాలకృష్ణ, రమేష్‌బాబు,సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలకు ముగిసిన దరఖాస్తుల ప్రక్రియ

కొలిమిగుండ్ల: ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ ముగిసిందని ఎంఈఓ అబ్దుల్ కలాం బుధవారం తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్‌లు ఆన్‌లైన్‌లో 69 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందులో తప్పని సరిగా 17 మంది ఉపాధ్యాయులు బదిలీ కావాల్సి ఉందన్నారు. ఎస్జీటీలు 58 మంది మ్యాన్యువల్‌గా ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయగా వాటిని అప్‌లోడ్ చేశామన్నారు. వీరిలో 24 మంది తప్పనిసరి బదిలీపై వెళ్లాల్సి ఉందన్నారు. త్వరలోనే బదిలీల ప్రక్రియ జరుగుతుందన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

బనగానపల్లె రూరల్ : మహిళలు వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు పేర్కొన్నారు. బుధవారం పట్టణం లోని సచివాలయం-4లో రుతుక్రమం, ఆరోగ్యం- పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్త్రీలలో రుతుక్రమం సహజమైనప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవగాహనలేదన్నారు. నెలసరి సమయంలో ప్రతిరోజు స్నానం చేయాలని చెప్పారు.అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కిశోర బాలికలకు శానిటరీ నాప్కిన్లు ఉచితంగా అందజేస్తామన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పీ రమేష్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల్ని స్మరించుకోవాలి

బేతంచెర్ల: దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణాలు అర్పించిన యోధుల్ని స్మరించుకోవాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బుగ్గన చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సమరసత సేవా ఫౌండేషన్ సహ కన్వీనర్ నాగ మోహన్ సూచించారు. బుధవారం అమ్మవారిశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, బహుముఖ ప్రజ్ఞశాలి స్వాతంత్ర్య వీరసావర్కర్ జయంతిని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కందగడ్డల జనార్దన్, విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షులు రామూర్తి, నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వీర సావర్కర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హిందూ సోదరులు మారుతి శర్మ, పుల్లారెడ్డి, శ్రీను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



వీర సావర్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



కొడితే సిక్స్ కొట్టాలి..

కోవెలకుంట్ల క్రీడామైదానంలో క్రికెట్ ఆడుతున్న విద్యార్థులు

వేసవికాలం పాఠశాలలు, కళాశాలలకు సెలవులు కావడంతో విద్యార్థులు ఆట పాటల్లో మునిగి తేలుతున్నారు. ఎండ, వర్షాలను సైతం లెక్కచేయకుండా వివిధ క్రీడల్లో తతమునకలవుతున్నారు. రెండు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిసి కోవెలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానం బురదమయంగా మారింది. వర్షం తెరపినివ్వడంతో మైదానంలో తడి ఆరిపోయింది. దీంతో బుధవారం పట్టణానికి చెందిన విద్యార్థులు క్రికెట్ ఆడుతూ బిజీగా కన్పించారు. – కోవెలకుంట్ల

డంపింగ్ యార్డు ఓ చోట...చెత్త మరో చోట

సంజామల: మండలంలో పలు గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో డంపింగ్ యార్డులు కీలకం. అధికారుల నిర్లక్ష్యంతో లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డులు వృథాగా మారుతున్నాయి. చాలా చోట్లు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా నిలుస్తున్నాయి. మండలంలోని ముదిగేడు గ్రామంలో కేంద్రం ఓ చోట ఉంటే చెత్త కోవెలకుంట్ల-అవుకు ప్రధాన రహదారి పక్కన వేస్తున్నారు. ఆ చెత్తకు నిప్పు పెడుతుండటంతో దాని నుంచి వెలువడే పొగతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. గ్రామంలో డంపింగ్ యార్డు ఉన్నప్పటికీ..ప్రధాన రహదారుల వెంట వేయడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



ముదిగేడులో నిరుపయోగంగా డంపింగ్ యార్డు



ముదిగేడు గ్రామ శివారులో రోడ్డు పక్కన చెత్తకు నిప్పు పెట్టిన దృశ్యం

సంక్షేమానికి చెల్లుచీటి

- సూపర్ సిక్స్ అమలుకోసం ప్రజల ఎదురుచూపులు
- జగన్ ప్రభుత్వంలో ప్రతి నెల సంక్షేమ పండుగ
- చిరువ్యాపారాలతో ఆర్థికంగా నిలబడ్డ మహిళలు
- నేటి ప్రభుత్వంలో అతివల పరిస్థితి ఆగమ్యగోచరం

అవుకు: ఐదేళ్ల పాటు వైఎస్సార్‌సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ జాతరతో ఇంటింటా పండుగ చేసుకున్న ప్రజానీకానికి కూటమి ప్రభుత్వంలో ఆ సంక్షేమం జాడ కనుమరుగైంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇంతవరకు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంతో మరో మారు చంద్రబాబు మార్క్ మోసాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ముఖ్యంగా మహిళలు.. కూటమి ప్రభుత్వం ఏదో చేస్తాదని నమ్మి ఓట్లేస్తే మోసం చేసిందని మండిపడుతున్నారు.జగనన్న ఉంటే ఈ పాటికి నెలకో సంక్షేమ పథకం చొప్పున తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేసేవారని, దీంతో తమ కుటుంబాలు సాఫీగా సాగేవని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం కేవలం పెంచిన ఫించన్ మాత్రమే ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం పథకం కూడా అరకొరగానే అమలవుతోందనే విమర్శలు వినిపిస్తున్నా యి. ఇటీవల కొత్త ఫించన్లకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పాగా.. ఇందులోనూ మెలిక ప్రభు త్వం మెలిక పెట్టింది, భర్త ఫించన్ తీసుకుంటూ మరణించిన భార్యలకు మాత్రమే ఫించన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పడంతో నిట్టూరుస్తున్నారు.

నాడు మహిళలకు పెద్దపీట..

గత ప్రభుత్వంలో మహిళలకు పెద్ద పీట వేశారు. ప్రతి పథకం వారి పేరు మీదుగానే అమలైంది. రాజకీయ రంగంలో, సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యతనిచ్చారు. జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, జగనన్న విద్యా దీవెన, జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ చేయూత, జగనన్న చేదోడు, వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు పాటు మహిళల పేరిటనే ఇళ్ల పట్టాల పంపిణీ లాంటి ఎన్నో పథకాలు అందించారు. కానీ ప్రస్తుతం ఎలాంటి పథకాలు అందజేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న ప్రజాగ్రహం..

రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా గతేడాది అనావృష్టి, అతివృష్టితో రైతులు భారీగా నష్టాలు మూటగట్టుకున్నారు. దీంతో ఎన్నడూ లేనిది దాదాపు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి కూలీలు, చిన్న, సన్నకారు రైతులు పనుల కోసం వలస వెళ్లారు. అయినా ప్రభుత్వం కనీస సాయం చేయకపోగా.. పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని సావు కబుదరు చల్లగా చెప్పింది. దీంతో అధిక శాతం మంది రైతులు ప్రీమియం చెల్లించలేక నష్టపరిహారాన్ని కోల్పోయారు. ఓ పక్క సంక్షేమ పథకాలివ్వకపోగా, కనీసం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో రాష్ట్రంలో జనంలో కొనుగోలు శక్తి భారీగా పడిపోయింది. అలాగే అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి కరువవడంతో ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల బాట పట్టకునేలా చేసిందని వాపోతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రజల్లో ఆగ్రహావేశాలు అధికమయ్యాయి.

అర్హులైతే చాలు లబ్ధి చేకూరేది



జగనన్న హయాంలో పార్టీలకు అతీతంగా అర్హులైతే చాలు పారదర్శకంగా సంక్షేమ పథకాలు ఇంటి గుమ్మంలోకి వచ్చేవి. కానీ నేడు పింఛన్ తప్ప మరో సంక్షేమ పథకం ఇప్పటి వరకు అమలు కాలేదు. సూపర్ సిక్స్ అన్నారు.. ఉచిత గ్యాస్ సిలిండర్..అది కూడా అరకొరగా సరిపెట్టారు. గత ఐదేళ్లు ఆనందంగా గడిపిన కుటుంబాలు నేడు దీనావస్థలో ఉన్నాయి.
– బి. సౌభాగ్యలక్ష్మి, డ్వాక్రా మహిళ, కాశీపురం గ్రామం

పేదలు అల్లాడిపోతున్నారు



సంక్షేమ పథకాలు అమలు కాక పేద ప్రజలు అల్లాడిపోతున్నారు. జగనన్న హయాంలో పొందిన సంక్షేమ పథకాలు నేడు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు ఎటువంటి లబ్దిబ్ది చేకూరడంలేదని ప్రజలు ముఖ్యంగా మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాదిరిగా కూటమి పాలకులకు చిత్తశుద్ధి లేదు. మునుపెన్నడూ ఏడాదిలోపే ప్రభుత్వంపై ప్రజాగ్రహం నెలకొనడం ఇప్పుడే చూస్తున్నాం.
–పోలక ప్రత్యూష, కునుకుంట్ల ఎంపీటీసీ సభ్యురాలు



రేపటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

పాములపాడు: మండల కేంద్రంలో ఈనెల 30 నుంచి ఐకాన్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి సమ్మర్ స్పెషల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వినయ్‌కుమార్, అనిల్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ప్రవేశ రుసుం రూ.600 చెల్లించి తమ జట్ల పేర్లను ఈనెల 29లోపు నమోదు చేయించుకోవాలన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్టకు వరుసగా రూ.30,000, రూ.20,000, రూ.10,000 చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9642069665, 7993008692 నంబర్లను సంప్రదించాలన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై తూర్పుగోదావరి జిల్లాకు చెందిన శారదా కళాక్షేత్రం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మహాగణపతిం, లింగాష్టకం, జ్యోతిర్లింగాకారా, శివస్తుతి, దేవీస్తుతి, పార్వతీ వల్లభాష్టకం తదితర గీతాలకు, అష్టకాలకు జ్ఞానశ్రీ, ప్రసన్న, ఆద్యశ్రీ తదితరులు నృత్యప్రదర్శన చేశారు.